కంపు..కంపు..!



అధ్వానంగా ఉన్న ప్రసూతి విభాగం ముందు భాగం



చిరిగిన పడకలు



గోడలపై గుట్కా ఉమ్మిలు



ప్రధాన గేటు వద్ద ఇలా..

- జిల్లా ఆస్పత్రి పరిసరాల్లో క్షీణించిన పారిశుధ్యం
- పేరుకుపోయిన చెత్త
- మరుగుదొడ్ల వైపు వెళ్లలేని దుస్థితి
- కానరాని అధికారుల పర్యవేక్షణ

టెక్కలి రూరల్:

అది పేరుకే జిల్లా ఆస్పత్రి. ఇక్కడకు వైద్యం కోసం వెళ్తే కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న టెక్కలి జిల్లా ఆస్పత్రి పరిసరాల్లో పారిశుధ్యం క్షీణించడంతో కంపుకొడుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆస్పత్రి వెలుపల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అలాగే ప్రసూతి విభాగం ముందుభాగంలో గోడలపై గుట్కా ఉమ్మిలు, చెత్తాచెదారంతో ఆ ప్రాంతం అధ్వానంగా ఉంది. దీంతో ఆ వార్డులో ఉండే పిల్లలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందనే ఆందోళన తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతుంది. ఆస్పత్రిలోని మరుగుదొడ్ల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. కనీస పరిశుభ్రత లేక ఆ మార్గం గుండా వెళ్లాలంటే ముక్కుమూసుకోవల్సిన పరిస్థితి నెలకుంది. డయాలసిస్‌తోపాటు మరికొన్ని వార్డుల్లో వాడిన నీరు, ట్యాంకులు నిండగా మిగిన నీరు ఆస్పత్రి ప్రధాన రహదారిపై నిలిచిపోతుండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. రోగులు పడుకునే పరుపులు సైతం పూర్తిగా పాడైపోవడంతో పాటు వాటిపైన బెడ్‌షీట్‌లు సైతం మార్చడంలేదని రోగులు వాపోతున్నారు.

ముగ్గురు సూపర్‌వైజర్లు ఉన్నా..

ఆస్పత్రిలో ముగ్గురు సూపర్‌వైజర్లు, 27 మంది శానిటేషన్ సిబ్బంది ఉన్నప్పటికీ పారిశుధ్యం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఒక్క సూపర్‌వైజర్ ఉన్నప్పుడే ఆస్పత్రి పరిసరాలు బాగుండేవని.. ఇప్పుడు ముగ్గురు ఉండటంతో ఎవరూ పట్టించుకోవడంలేదని ఆస్పత్రి సిబ్బంది సైతం చెబుతున్నారు.



ఆస్పత్రి ప్రధాన మార్గంలో నిలిచిపోయిన వాడుక నీరు

పర్యవేక్షణ శూన్యం..

ఆస్పత్రి పరిసరాలు, వార్డుల నిర్వాహణపై దృష్టిసారించాల్సిన సూపరిండెంటెంట్, హెడ్ నర్సులు కనీసం పట్టించుకోవవడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. అసలు హెడ్‌నర్సులు వస్తున్నారో.. లేదో కూడా తెలియడం లేదని రోగులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆస్పత్రి పరిసరాలపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

శానిటేషన్‌పై దృష్టిసారిస్తాం

శానిటేషన్‌పై దృష్టి సారిస్తున్నాం. ఎటువంటి పొరపాట్లు ఉన్నా సరిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం. పరుపులపై బెడ్ షీట్లు ఎప్పటికప్పుడు మార్చాలని సిబ్బందికి ఆదేశాలిస్తాం. ఆస్పత్రి పరిసరాల్లో ఎటువంటి మురుగు లేకుండా చర్యలు చేపడతాం.

– బొడ్డేపల్లి సూర్యారావు, సూపరింటెండెంట్, టెక్కలి జిల్లా ఆస్పత్రి

క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన సదస్సు రేపు

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు జరగనున్న సదస్సులో ఓఎంఆర్ జవాబు పత్రం మార్కింగ్, సబ్జెక్టు వారీగా ప్రశ్నావళి క్రమం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

2న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఎంపికలు

ఇచ్ఛాపురం రూరల్: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల రెండో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలాభివృద్ధి కార్యాలయంలో ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజరు కావాలన్నారు.

ఆత్మరక్షణపై అవగాహన



ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి: బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల నుంచి కాపాడుకోవడానికి అత్యవసరమైన ఆత్మరక్షణ విద్యపై విద్యార్థినులకు సోమవారం స్థానిక ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలలో అవగాహన కల్పించారు. శక్తి పోలీస్ టీమ్, స్థానిక తైక్వాండో కోచ్ ఎన్.శేఖర్‌తో పాటు తైక్వాండో విద్యార్థుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. శక్తి టీమ్ ఎస్సై బాలకృష్ణ, ప్రిన్సిపాల్ పి.సుధారాణి, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హిజ్రాల నిరసన



నిరసన తెలియజేస్తున్న హిజ్రాలు

ఇచ్ఛాపురం: అనకాపల్లిలో ఇటీవల హత్యకు గురైన హిజ్రా దీపు కుటుంబానికి న్యాయం చేయాలని ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ట్రాన్స్‌జెండర్లు కోరారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ కూడలిలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిజ్రాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సంజన కిన్నెర, లక్ష్మీ, మీనాక్షి, సోనియా, బెబో, సోనాలి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


అలరించిన చిన్నారుల ప్రదర్శన



పురస్కారాలతో నాట్యకళామండలి చిన్నారులు

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన నటరాజ నాట్యక ళామండలి నృత్య కళాకారులు ఉగాది సందర్భంగా స్వర్ణగిరి హైదరాబాద్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన నృత్యప్రదర్శనలో అలరించారు. తిరువీధుల్లో పాల్గొని అద్భుత ప్రదర్శన ఇచ్చారు. చిన్నారులను దేవాలయం కార్యదర్శి నరేంద్ర యాదవ్, దుశ్శాలువలతో సత్కరించి పురస్కారాలు అందజేశారు. నాట్య గురువు ఇద్ది కామేశ్వరి, చిన్నారులు ఆర్.స్నేహా, ఎం.మనస్విని, ఆర్.లలిత, ఎం.లాసిస్ పాల్గొన్నారు.

డాక్టర్ బాలకృష్ణకు పితృవియోగం



మల్లేశ్వరరావు (ఫైల్)

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ తాళాభక్తుల బాలకృష్ణ తండ్రి మల్లేశ్వరరావు (68) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. స్వగ్రామం నందిగాం కాగా.. ప్రస్తుతం చినబడంలో నివాసం ఉంటున్నారు. ఆర్ఎంపీ వైద్యుడుగా ప్రజలకు సుపరిచితుడు. అనేక మందికి సేవలు అందించారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, కోడలు జోత్స్న పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలుగా పనిచేస్తున్నారు. మల్లేశ్వరరావు మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కాశీబుగ్గ: కాశీబుగ్గ హైస్కూల్‌లో లలిత కళా రంజని 34వ వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తగరపువలసకు చెందిన నవ చైతన్య కళా నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రఖ్యాత కళాకారులు సరగడ చెన్నారెడ్డి, పద్మావతిలచే రైతు వెతలపై జానపద నృత్యం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. శ్రీకాకుళంలోని లలిత శ్రీకళాసమితి వారిచే 'మతమా మానవత్వమా' సాంఘిక నాటిక ఆహూతులను అలరించింది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



గణపతిరావును అభినందిస్తున్న తిలక్

టెక్కలి: ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వ వైఫల్యాలను ఆయా వర్గాలకు అవగాహన కల్పించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షునిగా నియామకమైన విశ్రాంత ఉపాధ్యాయుడు మోదుగువలస గణపతిరావును సోమవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లపై ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై పోరాటం చేయాలని కోరారు. గణపతిరావు మాట్లాడుతూ.. ఎంతో నమ్మకంతో తనకు అందజేసిన బాధ్యతతో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కోటబొమ్మాళి మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.జీవన్‌తో పాటు ఎ.దుర్యోధనరావు, రమేష్ ఉన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిరసన



నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.నీలకంఠంపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సిబ్బంది డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కండక్టర్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ డిపో ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేసి కండక్టర్‌కు న్యాయం చేయకపోతే ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని డిప్యూటీ జనరల్ సెక్రటరీలు పి.భానుమూర్తి, బి.కృష్ణమూర్తి అన్నారు. జిల్లా అధ్యక్షులు జి త్రినాథ, డిపో సెక్రటరీ ఎ.దిలీప్‌కుమార్, డిపో నాయకులు జీకే రాజు, పి.ఎల్.నారాయణ, ఎల్.ఎ.రావు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

కండక్టర్ నీలకంఠంపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సీతారామనాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు, అధ్యక్షులు పెద్దింటి ఈశ్వరరావు, సవర రామారావు, సవర మోహనరావు ఉన్నారు.

వసతి గృహం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న అనురాధ

ఇచ్ఛాపురం: వసతి గృహాల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఇ.అనురాధ సూచించారు. ఇచ్ఛాపురం పట్టణంలోని బీసీ వసతి గృహాన్ని సోమవారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానిక బీసీ హాస్టల్‌లో 120 మంది గాను 35 సీట్లు భర్తీకాగా మిగిలిన 65 సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీచేసేలా చర్యలు చేపట్టాలని వార్డెన్‌కి సూచించారు. స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఒడిశా ప్రాంతానికి చెందిన విద్యార్థులకు కూడా హాస్టల్‌లో సౌకర్యం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. వార్డెన్ రవికుమార్ ఉన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు



రాష్ట్రస్థాయిలో ఉగాది పురస్కారం అందుకున్న పలాస అగ్నిమాపక కేంద్రం అధికారి బి.సోమేశ్వరరావును సిబ్బంది అభినందించారు. కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుశ్శాలువతో సత్కరించి గౌరవించారు. వివిధ సందర్భాల్లో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సిబ్బంది కె.యుగంధర్, డి.భాస్కరరావు, పి.శ్రీనివాసరావు, పి.మన్మథరావు, కె.సంతోష్ ఉన్నారు. – కాశీబుగ్గ

భానుడు భగ..భగ



భానుడు సోమవారం భగభగ మండిపోయాడు. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. టెక్కలిలోని ప్రధానరోడ్లన్నీ జనసంచారం లేక కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. –టెక్కలి

సీసీ కెమెరాల ఏర్పాటు



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం మండలంలోని చర్చిలు, ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. సోమవారం ఈదుపురం, డొంకూరు, తులసిగాం, మండపల్లి గ్రామాల్లోని చర్చిలు, ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. –ఇచ్ఛాపురం రూరల్

మూఢ నమ్మకాల నిర్మూలనపై పాట చిత్రీకరణ



పలాస రైల్వే ఇనిస్టిట్యూట్ వద్ద షూటింగ్‌లో కళాకారులు

కాశీబుగ్గ: మూఢ నమ్మకాల నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సమసమాజ స్థాపన కోసం అనే ట్యాగ్ లైన్‌తో షార్ట్ ఫీల్మ్ చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో భాగంగా సోమవారం కాశీబుగ్గ పాత బస్టాండ్, రైల్వే గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ నగిరి కరుణాకర్ మాట్లాడుతూ.. అసమానతలు లేని సమాజం కోసం పాటుబడిన మహనీయుల జీవిత చరిత్ర, జన్మదినాలు గుర్తుచేస్తూ ప్రజల్లో చైతన్యం కోసం ప్రజలందరూ ముందు ఉండాలని కోరారు. కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంస్థ జిల్లా కమిటీ అధ్యక్షులు గీతారాణి, ఏపీఎన్జీవో పలాస అధ్యక్షులు బోనెల గోపాలరావు, పౌరహక్కుల సంఘం ప్రతినిధి పిట్ట జోగారావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు బోకర దుర్యోధన, చెల్లూరు పద్మలోచన పాల్గొన్నారు.

రికవరీలు తప్పనిసరి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ సంఘాల ఆర్థిక లావాదేవీలతో పాటు శ్రీనిధి, గ్రామ సంఘం తీసుకున్న రుణాలను రికవరీ చేయాలని స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.సత్యనారాయణ అన్నారు. సోమవారం ఇచ్ఛాపురం మండల మహిళా సామాఖ్య భవనంలో సీసీలు, వీవోఏల ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వార్షిక ప్రణాళిక జీవనోపాధులు కొత్త రుణాలకు సంబంధించి ఇది వరకు శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్యూమరేటర్లు మంగళవారం నుంచి గ్రామాల్లో మొదలు పెట్టాలని అన్నారు. సమావేశంలో ఏపీఎం సనపల ప్రసాదరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. మతగురువులు రంజాన్ ప్రాధాన్యతను వివరించి నమాజ్ చేశారు. నెల రోజుల ఉపవాస దీక్షలను విరమిస్తున్నట్టు ప్రకటించారు. – సాక్షి నెట్‌వర్క్



కాశీబుగ్గ: జామియా మసీదులో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



కంచిలి: మక్కా మసీదులో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం: లాలాపేట జామియా మసీదులో ప్రార్థనలు చేస్తూ..



టెక్కలి: జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఇచ్ఛాపురం టౌన్: కస్పావీధి మసీదులో ప్రత్యేక పార్థనలు చేస్తూ..

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరు ఎల్‌సీ గేటు సమీపంలో చలివేంద్రాన్ని యువసూర్య చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. దీన్ని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి ప్రారంభించారు. యువ న్యాయవాది, సంస్థ చైర్మన్ ఎం.రాంబాబు 15 ఏళ్లుగా వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపీ, సత్యసాయి విద్యా సంస్థ చైర్మన్ ఎస్.భాపుతేజా తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి



ర్యాలీలో క్రైస్తవులు, దళిత సంఘాల ప్రతినిధులు

టెక్కలి: రాజమండ్రి సమీపంలో ఇటీవల పాస్టర్ ప్రవీణ్ మృతి చెందిన ఘటనపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని టెక్కలి నియోజకవర్గ స్థాయి పాస్టర్లు, దళిత సంఘాల నాయకులు, క్రైస్తవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టెక్కలిలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్ నుంచి ఫ్లెక్సీలు, ప్లకార్డులతో చేపట్టిన ర్యాలీను అంబేడ్కర్ జంక్షన్ వరకు కొనసాగించారు. కార్యక్రమంలో పాస్టర్లు కె.అబ్రహం, పి.మోహన్, రమణ, సుధాకర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎ.రాహుల్, దళిత సంఘాల నాయకులు బి.నారాయణరావు, చల్లా రామారావు ఉన్నారు.

రోడ్డును తవ్వేసి వదిలేశారు..

కవిటి: మండలంలోని జగతి గ్రామం నుంచి శిలగాం మీదుగా జాతీయ రహదారి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును మరమ్మతుల పేరుతో తవ్వేసి వదిలేశారు. రెండు నెలలు కావస్తున్నా పనులు పూర్తిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు మండల కేంద్రం నుంచి జాతీయ రహ దారికి వెళ్లాలన్నా, ఇరవై గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలన్నా ఈ రోడ్డే ఆధారం. అంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డును తవ్వేసి వదిలేసిన అధికారు లు, కూటమి నాయకులు కనీసం పట్టించుకోవడం లేదు. రోడ్డు సమస్యను ఎమ్మెల్సీ నర్తు రామారావు జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదు.



తవ్వి వదిలేసిన రోడ్డు